వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 275
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
ఆగస్టు 06, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



## తెలంగాణకు స్ఫూర్తి జయశంకర్ సార్

- పూల మాలలు వేసి నివాళులర్పించిన అధికారులు, నేతలు
- రాష్ట్ర పండువగా నిర్వహణ

8లో..

# ప్రగతి కారకుడు కలెక్టర్ దివాకర



2లో..








ఆలోచనల్లో వైవిధ్యం.. చెదరని చిరునవ్వు.. సాధారణ జీవితం.. సమాజహితమే తన అభిమతంగా పనిచేస్తున్న ఆయనే అడవుల జిల్లా ములుగు కలెక్టర్ దివాకర్ టీఎస్. చిరు వ్యాపారం చేసుకునే కుటుంబంలో జన్మించినప్పటికీ అంచెలంచెలుగా ఎదిగి ఐఏఎస్ స్థాయికి చేరేందుకు ఆయన పడిన శ్రమ అంతా..ఇంతా కాదు. మధ్య తరగతి జీవితాల గురించి తెలిసిన ఆయన విద్యా ,వైద్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ప్రజా వాణి సమస్యల పరిష్కారంతోపాటు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా చర్యలు చేపట్టిన కలెక్టర్ పాలనలో ప్రత్యేకతను చాటుతున్నారు. ఆదివాసీల అభివృద్ధికి అనునిత్యం పాటుపడుతూనే జిల్లా సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించారు. వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ములుగు జిల్లా అభివృద్ధిలో చెరగని ముద్ర వేస్తున్నారు. వివాదరహితుడు.. సౌమ్యుడిగా గుర్తింపు పొందిన ఆయన పాలనపరమైన నిర్ణయాల్లో మాత్రం కఠినంగానే వ్యవహరిస్తున్నారు. ములుగు కలెక్టర్ దివాకర టీఎస్ ప్రస్థానం, పాలనలో ఆయన ముద్ర, కుటుంబం నేపథ్యంపై 'వరంగల్ వాయిస్' ప్రత్యేక కథనం..

- చిరు వ్యాపారి కుటుంబం నుంచి ఐఏఎస్ స్థాయికి
- ములుగు జిల్లా అభివృద్ధిలో చెరగని ముద్ర
- విద్య, వైద్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక ఫోకస్
- ఆదివాసీల అభ్యున్నతికి ఎనలేని కృషి
- ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు




8లో..

## జయశంకర్ బాటలో కేసీఆర్

- ఊరూరూ తిరిగి ఉద్యమ వ్యాప్తి
- నీళ్లు, నిధులు, నియామకాలకోసం పోరాడి తెలంగాణ సాధన
- బీఆర్ఎస్ పాలనలో రెండు లక్షల ఉద్యోగాలు

## స్థానికులకే ఉద్యోగావకాశాలు

- లోక్ సభలో డాక్టర్ కడియం కావ్య



8లో..



8లో..

## ఇంటింటికీ బీజేపీ


- ఇల్లందలో మహా సంపర్క్ అభియాన్
- గడపగడపకు చేరుతున్న సందేశం



- చిరు వ్యాపారి కుటుంబం నుంచి ఐఏఎస్ స్థాయికి
- ములుగు జిల్లా అభివృద్ధిలో చెరగని ముద్ర
- విద్య, వైద్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక ఫోకస్
- ఆదివాసీల అభ్యున్నతికి ఎనలేని కృషి
- ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు

# ప్రగతి కారకుడు కలెక్టర్ దివాకర

గడ్డం కేశవమూర్తి
Cell:9390101862



కర్ణాటక రాష్ట్రం తుంకూర్ జిల్లా టిప్టూర్ గ్రామంలో 1988 ఏప్రిల్ 9న ప్రేమ–శివకుమార్ దంపతులకు దివాకర టీఎస్ జన్మించారు. వీరిది పూజా సామాగ్రి విక్రయించే చిరు వ్యాపార కుటుంబం. ఇద్దరు అన్నదమ్ములు. ఇంట్లో పెద్ద కుమారుడు దివాకర కాగా, తమ్ముడు హరీష్ ఇరిగేషన్ శాఖలో ఏఈఈగా పనిచేస్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు స్వగ్రామంలోని డఫ్ఫోడిల్ పాఠశాలలో, ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దివాకర చదువుకున్నారు. కల్పతరు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, మైసూరులోని శ్రీ జయచామ రాజేంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో బిఈ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశారు. 2010 నుంచి 2015 వరకు హైదరాబాదులోని డెలాయిట్ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పని చేశారు. ఏడాదిపాటు అదే కంపెనీకి అమెరికాలో కూడా సేవలు అందించారు. అనంతరం సివిల్స్ పై ఉన్న మక్కువతో 2016లో యూపీఎస్సీ పోటీ పరీక్షలకు హాజరయ్యారు. 2017లో జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు సాధించి ఒడిస్సా కేడర్ కు ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. 2020 డిసెంబర్ 23న ఖమ్మం జిల్లాకు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి భూక్య లావణ్యను వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు తేజస్, కుమార్తె తన్మయ ఉన్నారు. సతీమణి లావణ్య హనుమకొండలో డిస్ట్రిక్ ఫారెస్ట్ ఆఫీసర్ గా పనిచేస్తున్నారు.

## ఉద్యోగ ప్రస్థానం..

ఐఏఎస్ అధికారిగా శిక్షణ పూర్తయిన తర్వాత దివాకర టీఎస్ ఒడిస్సా రాష్ట్రంలోని కోరాపూర్, కాలహండిలలో సబ్ కలెక్టర్ గా సేవలందించారు. స్పోట్స్ కోటాలో భాగంగా 2021లో తెలంగాణ క్యాడర్ కు ఆయన బదిలీపై వచ్చారు. భూపాలపల్లి, జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ గా మూడేళ్ల పాటు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించారు. అనంతరం పదోన్నతి పొంది 2024 జూన్ 16న ములుగు జిల్లా కలెక్టర్ గా నియమితులయ్యారు. మొదట ఒడిస్సాలో, ప్రస్తుతం తెలంగాణలో ప్రజల మన్ననలు పొందుతూ ఆదివాసీలకు ఆపద్బాంధవుడిగా నిలుస్తున్నారు.

## వినూత్న కార్యక్రమాలు..

ములుగు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం కలెక్టర్ దివాకర టీఎస్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. రూ.150 కోట్లతో మేడారంలో చేపట్టిన శాశ్వత అభివృద్ధి పనుల్లో వేగం పెంచారు. జిల్లాలో 4,625 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా చూస్తున్నారు. గతంలో నిర్మించిన సుమారు 1,200 పైచిలుకు డబల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేసారు. 65 కొత్త గ్రామపంచాయతీలు, 30 అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ఏటూరు నాగారంలో ఆర్టీసీ బస్ డిపో నిర్మాణం, ములుగులో నూతన కలెక్టర్ కార్యాలయ భవనం పనులు శరవేగంగా జరిపిస్తున్నారు. ట్రైబల్ యూనివర్సిటీకి కావలసిన భూమిని సేకరించారు. తాడ్వాయిలో బ్లాక్ బెర్రీ ఐలాండ్ ను ప్రారంభించి పర్యాటకులకు వసతి సౌకర్యాలు సమకూర్చారు. జిల్లా కేంద్రంలో టాస్క్ కేంద్రాన్ని ప్రారంభించి నిరుద్యోగ యువతకు శిక్షణ ఇప్పిస్తున్నారు. 80 రోజుల్లో ఇంగ్లీష్ నేర్చుకునేలా యువతకు కార్యక్రమం రూపకల్పన చేశారు. ములుగులో శ్రీయ ఇన్ఫోటెక్ సాఫ్ట్ వేర్ కంపెనీని త్వరలో ప్రారంభించే ఏర్పాట్లు చేస్తున్నారు.

## అభివృద్ధిపైనే ఫోకస్..

మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన 900 మంది రైతులకు రూ.3.80 కోట్ల పరిహారం ఇప్పించారు. భూభారతి సదస్సుల ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తూనే, రేషన్ కార్డులు, సన్న బియ్యం అందిస్తున్నారు. వివిధ రకాల పింఛన్లలో అక్రమాలకు చెక్ పెట్టారు. అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో గోదావరి వరద ముంపు నివారణ కోసం ముందస్తు చర్యలు తీసుకున్నారు. భారీ వర్షాలతో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు పాటించారు. రైతాంగానికి ఎరువులు అందుబాటులో ఉంచారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తున్నారు. ఉద్యాన పంటలకు ఊతమిస్తూ.. రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నారు. త్వరలో ఇంచర్లలో ఆయిల్ ఫామ్ కంపెనీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా అటవీ, ప్రభుత్వ భూముల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకున్నారు. జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించి విరివిగా మొక్కలు నాటారు. మేడారం ఫారెస్ట్ పునరుద్ధరణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్న కలెక్టర్.. రామప్ప నుంచి లక్నవరం సరస్సు వరకు ప్రత్యేక కెనాల్ నిర్మించి రెండు పంటలకు సాగునీటిని అందించే పనిలో నిమగ్నమయ్యారు.

విద్య, వైద్యం, పౌష్టికాహారానికి ప్రాధాన్యం..

కలెక్టర్ దివాకర టీఎస్ గత ఏడాది కాలంగా విద్య, వైద్యం, పౌష్టికాహారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లా, ఆరోగ్య కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ వాటిలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తున్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేస్తూ, వసతి గృహాల్లోనే నిద్రిస్తున్నారు. ఐసీడీఎస్, అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. తల్లిపాలె ఆరోగ్యం, అమృతం.. అంటూ ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ వైద్య, ఆరోగ్య కేంద్రాల్లో కనీస వసతులు కల్పిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కంటైనర్ స్కూల్, హాస్పిటల్ ను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ప్రతి హాస్టల్ కు ఒక స్పెషల్ ఆఫీసర్ నియమించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా బోధన అందే విధంగా చూస్తున్నారు. ములుగు జిల్లా పదో తరగతిలో స్టేట్ 8వ ర్యాంక్, ఇంటర్మీడియట్ లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడంలో కలెక్టర్ దివాకర కృషి ఎంతో ఉంది.

## ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం..

సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సఖి' కేంద్రాలు సత్ఫలితాలిస్తున్నాయి. మహిళల భద్రత విషయంలో కలెక్టర్ దివాకర టీఎస్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా కృషి చేస్తున్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. వర్షాకాల వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించారు. సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో పనిచేసే అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేస్తే విజయం వరిస్తుందంటారు కలెక్టర్ దివాకర టీఎస్. ములుగు జిల్లాకు చెందిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క సహాయ, సహకారాలతో ఏజెన్సీ ప్రాంతమైన ములుగును ప్రగతి పథంలో నిలపడంలో కలెక్టర్ దివాకర టీఎస్ కృషి ఎనలేనిదని చెప్పవచ్చు.

## ప్రత్యేక అవార్డు...

యువ ఐఏఎస్ అధికారిగా దివాకర టీఎస్ ములుగు జిల్లాపై ప్రత్యేక ముద్ర వేశారు. ఆలోచనల్లో కొత్తదనం ఉన్న ఆయన గిరిజనులు,పేదల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నారు. ములుగు జిల్లాలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ కలెక్టర్ దివాకర పేదల పెన్నిధిగా పేరు తెచ్చుకున్నారు. విధి నిర్వహణలో నిక్కచ్చిగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారనే అభిప్రాయం అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిలో ఉంది. ములుగును సంపూర్ణతా అభియాన్ జిల్లాగా తీర్చిదిద్దినందుకుగాను రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా కలెక్టర్ ప్రత్యేక అవార్డును అందుకున్నారు.



















# వీరోచిత పోరాటాల చరిత్ర సీపీఐ సొంతం

◆ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి
◆ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్వాతంత్ర్య పోరాటంలో వేలాది మంది బలిదానం చేసిన వీరోచిత చరిత్ర సీపీఐదని, పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జరుగుతున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా నిజాం నియంతృత్వాన్ని కూలదోసి, ప్రజలకు స్వేచ్ఛను అందించింది సీపీఐ మాత్రమేనని గుర్తుచేశారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, భూ సంస్కరణలు, ప్రభుత్వ రంగ సంస్థల స్థాపన కోసం ప్రజా ఉద్యమాలు నడిపిందని ఆయన అన్నారు. వంద సంవత్సరాల ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నా, సీపీఐ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందని తెలిపారు. మత సామరస్యం, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడటంలో సీపీఐ పాత్ర ఎంతో గొప్పదని ఆయన పేర్కొన్నారు. ప్రజల తరపున అండగా ఉంటూ, వారి సమస్యలను తన సమస్యలుగా భావించి ముక్కుసూటిగా పోరాడుతున్న సీపీఐని ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 20, 21, 22 తేదీలలో మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, గాజుల రామారం మహారాజ గార్డెన్‌లో జరుగుతాయని తెలిపారు. భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ విస్తరణ కోసం ఈ మహాసభలలో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని శ్రీనివాసరావు చెప్పారు. ఈ మహాసభలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, బత్తిని సదానందం, నకీర్త ఓదెలు, మంచాల రమాదేవి, మాలోతు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ డిప్లొమా సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** టీజీ పాలిసెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయడానికి వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తోంది. అర్హత పొందిన, పొందని విద్యార్థులు (నాట్ క్వాలిఫైడ్) కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. దరఖాస్తులు స్వీకరించు తేదీలు ఆగస్టు 5, 6, 7, స్పాట్ అడ్మిషన్ (సీట్ల కేటాయింపు) ఆగస్టు 8. అందుబాటులో ఉన్న కోర్సు మెకానికల్ డిప్లొమాలో 28 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇతర కోర్సుల వివరాల కోసం విద్యార్థులు https://tgpolycet.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. అర్హత ఉన్న అభ్యర్థులు ఆగస్టు 8, 2025న ఉదయం 10:00 గంటలలోపు ఈ కింది ధ్రువపత్రాలతో ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్ కళాశాలకు తప్పనిసరిగా హాజరుకావాలి. టీసీ, ఎస్సెస్సీ మెమో (10వ తరగతి మార్కుల మెమో), కులం సర్టిఫికెట్ (అవసరమైన వారికి), ఆధార్ కార్డు టీజీ పాలిసెట్-2025 ర్యాంక్ కార్డ్ (అర్హత పొందిన విద్యార్థులకు మాత్రమే), ఇతర అవసరమైన ధ్రువపత్రాలు అవసరం ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్, డా. బైరి ప్రభాకర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# గొర్ల పెంపకం దారులకు నగదు బదిలీ చేయాలి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం, రూ. 2 లక్షల నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలని, అలాగే గొర్రెలు, మేకలకు నట్టల మందు పంపిణీని తిరిగి ప్రారంభించాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం ప్రభుత్వంపై డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సంఘం జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య, మండల అధ్యక్షుడు మిరియాల కుమార్ ఆధ్వర్యంలో ఆత్మకూరు తహశీల్దార్ జగన్మోహన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండో విడత గొర్రెల పంపిణీని రూ. 2 లక్షల నగదు బదిలీ ద్వారా అమలు చేసి, పెంపకం దారులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో పోరాటాలు తప్పవని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చిట్టె లింగయ్య, కాడబోయిన రమేష్, ఎగితే లింగయ్య, కాడబోయిన రవి, కంచ రవి, మంగ చిన రవి, ఓదెలు, కుండే నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిర మహిళా శక్తి.. మహిళలకు స్వయం ప్రతిపత్తి

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



**వరంగల్ వాయిస్, జనగామ :** కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "ఇందిరా మహిళా శక్తి పథకం"కు శ్రీకారం చుట్టిందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ముందు కళ్యాణి స్వయం సహాయక సంఘానికి చెందిన మంజుల అనే మహిళ రూ. 2 లక్షల రుణం సహాయంతో ఏర్పాటు చేసిన 'వనిత టీ స్టాల్' ను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా స్టవ్ వెలిగించి, పాలు పెట్టి మహిళా వ్యాపారానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ, ఎల్‌డీఎం, మున్సిపల్ కమిషనర్, బ్యాంకు అధికారులతో కలిసి టీ తాగి, దాని రుచిని మెచ్చుకున్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు మంజులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ, డీపీఎం, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# హాలో బీసీ ఛలో ఢిల్లీలో ప్రణవ్

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ధర్నా



**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని, దీనికి మద్దతుగా రాష్ట్ర అసెంబ్లీలో, క్యాబినెట్‌లో తీర్మానం చేసి పార్లమెంటు ఆమోదానికి పంపామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లోక్‌సభలో బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ధర్నా కార్యక్రమం నిర్వహించింది. ఈ ధర్నా కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ ఉపాధ్యక్షులతో పాటు హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కూడా పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి తాము బిల్లుకు ఆమోదం తెలిపి రాష్ట్రపతి, గవర్నర్‌కు పంపామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బిల్లును వెంటనే ఆమోదించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి.

# ఫొటో జర్నలిస్టులకు ప్రత్యేక ఫొటో పోటీలు

◆ ఉత్తమ ఛాయా చిత్రాలకు బహుమతులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్టాఫ్ ఫొటో జర్నలిస్టుల కోసం ప్రత్యేక ఫొటో పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు బుధవారం ప్రకటించారు. ఇప్పటివరకు ఎవరూ ఈ తరహా పోటీలు నిర్వహించలేదని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఫొటోలు పంపాల్సిన తేదీలు ఆగస్టు 7 నుంచి 11వ తేదీ వరకు. విభాగాలు బెస్ట్ న్యూస్ పిక్చర్, ఫీచర్, కల్చర్ అని తెలిపారు. సైజు 8/12 సైజులో ఫొటోలను పంపించాలన్నారు. ఒక్కొక్కరు గరిష్టంగా మూడు ఫొటోలను పంపించవచ్చని చెప్పారు. పోటీల్లో ఉత్తమమైన వాటికి బహుమతులు అందిస్తామని ప్రకటించారు. ప్రథమ బహుమతి (బెస్ట్ న్యూస్ పిక్చర్) రూ. 10,000 నగదు, షీల్డ్, సర్టిఫికెట్, ద్వితీయ బహుమతి (బెస్ట్ ఫీచర్ ఫొటో) రూ. 5,000 నగదు, షీల్డ్, సర్టిఫికెట్, తృతీయ బహుమతి (బెస్ట్ కల్చర్ ఫొటో) రూ. 3,000 నగదు, షీల్డ్, సర్టిఫికెట్, కన్సోలేషన్ బహుమతి రూ. 1,000 నగదు, షీల్డ్ అందజేస్తామన్నారు. ఫొటోలను నేరుగా లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించవచ్చని నిర్వాహకులు తెలిపారు. పోస్టు ద్వారా పంపేవారు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్, హౌజ్ నెం. 7-1-99/C, ఫైర్ స్టేషన్ ఎదురుగా, బాలసముద్రం, హనుమకొండ, పిన్ కోడ్: 506001 అనే చిరునామాకు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు గోకారపు శ్యాం (9000283008), సంపేట సుధాకర్ (9985410386), పెద్దపల్లి వరప్రసాద్ (9912199869), వీరగోని హరీష్ (9985411670)లను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి బోల్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం, బొడిగె శ్రీను, సహాయ కార్యదర్శులు సంపెట సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, వలిశెట్టి సుధాకర్, బూర్ల నరేందర్, పొడిచెట్టి విష్ణువర్ధన్, ఈసీ మెంబర్లు వీరగోని హరీష్, ఎండీ నయీంపాషా తదితరులు పాల్గొన్నారు.



# భవాని మాతకు గాజుల సమర్పణ



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం, శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్లు) లోని భవాని మాతకు గాజులను సమర్పించారు. గణపురం మండలానికి చెందిన హరిప్రియ కంగన్ హాల్ నిర్వాహకులు సంగెపు మానస, సతీష్ దంపతులు రూ.5 వేలతో ఈ గాజులను అమ్మవారికి అందజేశారు. శ్రావణ మాసం సందర్భంగా నూతన గృహప్రవేశాన్ని పురస్కరించుకుని ఈ దంపతులు ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా సతీష్, మానస దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. భవాని మాతకు గాజులను సమర్పించిన సతీష్, మానస దంపతులకు కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

బుధవారం, ఆగస్టు 06, 2025

# జయశంకర్ జీవితం తెలంగాణకు అంకితం

■ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రొఫెసర్ జయశంకర్ జీవితం తెలంగాణకు అంకితమని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బుధవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జయశంకర్ సార్ 91వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా జీవించిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడిగా, మలి దశ ఉద్యమానికి దిక్సూచిగా ఆయన నిలిచారని తెలిపారు. 'పుట్టుక నీది, చావు నీది, బతుకంతా తెలంగాణది' అని నమ్మి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి జయశంకర్ అని వారు గుర్తు చేసుకున్నారు. తెలంగాణ సమాజాన్ని ఉద్యమ బాటలో నడిపించిన గొప్ప వ్యక్తిత్వం ఆయనదని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్లు చెన్నం మధు, సంకు నర్సింగరావు, నాయకులు జనార్దన్ గౌడ్, పులి రజినీకాంత్, నాయీముద్దీన్, జానకిరాములు, వినీల్ రావు, దేవమ్మ, తస్లీమా, ఇస్మాయిల్, ఖలీల్, రమేష్, మహమూద్, విజయ్ రెడ్డి, రామ్ చందర్, శేఖర్, రాజేందర్, శరత్, రాకేష్ యాదవ్, రాజ్ కుమార్, మనోజ్, శ్రీకాంత్, రాజు, శ్యామ్ రెడ్డి, ప్రభాకర్, అనిల్, సలాం అబ్దుల్, సారిక తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ సేవలు మరువలేనివి



**వరంగల్ వాయిస్,హనుమకొండ :** ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేనివని హనుమకొండ జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ (డీటీఓ) వేణుగోపాల్ అన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా బుధవారం డీటీసీ సురేష్ రెడ్డి ఆదేశాల మేరకు, హనుమకొండ జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుత, స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా జీవితాన్ని గడిపిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ కోసం ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రమేష్ రాథోడ్, సీనియర్ అసిస్టెంట్ ఎస్. శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ రుక్మిణి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, రామకృష్ణ, నర్మద, నరేందర్, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## వోపా ఆధ్వర్యంలో జయశంకర్ కు నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విశ్వబ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఘనంగా నివాళులర్పించారు. బాలసముద్రంలోని జయశంకర్ స్మృతి వనంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వోపా నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జయశంకర్ కీలక పాత్ర పోషించారని, ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు. తెలంగాణ ప్రజల అస్తిత్వం కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి జయశంకర్ అని, ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వోపా నాయకులు సంగోజు మోహన్, డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, మహేశ్వరం భిక్షపతి, ఆకోజు సురేందర్ రావు, కలకొండ రాజేంద్రప్రసాద్, కొక్కొండ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాల మండల కేంద్రంలో..



**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ సార్ 91వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శృంగారపు రంగాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగాచారి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఆయన ఆలోచనలు, పోరాటాలు మనందరికీ మార్గదర్శకమని తెలిపారు. విద్యారంగంలో జయశంకర్ చేసిన సేవలు అమోఘమని, ప్రజల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడారని గుర్తు చేసుకున్నారు. జయశంకర్ గారు విశ్వబ్రాహ్మణ జాతిలో జన్మించడం తమకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మొగులోజు భగవత్ చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోతగంటి చంద్రమౌళి చారి, ఉపాధ్యక్షులు సంతోష్ చారి, ప్రధాన కార్యదర్శి చిలువుల రాజమౌళి చారి, కోశాధికారి కలచర్ల కృష్ణమూర్తి, టౌన్ ఉపాధ్యక్షులు చిలుముల రమణాచారి, నాయకులు రమేష్ చారి, కళ్యాణ్ రామ్ కుమార్, కందాల స్వరూప, రాజేందర్, కిషోర్, రామ్, సురేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం ఆధ్వర్యంలో ..

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆయన స్వగ్రామమైన అక్కంపేటలో బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి గౌరవం తెలిపారు. ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ జయశంకర్ తన జీవితాన్ని స్వరాష్ట్ర సాధన కోసం అంకితం చేశారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ఆయన ఎలుగెత్తి చాటారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మన బిడ్డల భవిష్యత్తు బాగుపడుతుందని తన గొంతుకను వినిపించారని, స్వరాష్ట్ర సాధనలో ఆయన కీలక పాత్ర పోషించారని ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రవ్వ శివప్రసాద్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి వేముల సురేష్, గుడెప్పాడ్ బూత్ ప్రెసిడెంట్ పెండ్యాల సునీల్ రెడ్డి, కార్యకర్తలు ఊకంటి శ్రీనివాస్ రెడ్డి, మేక కృష్ణా రెడ్డి, బలభద్ర సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



## జయశంకర్ ఆశయాలను కొనసాగించాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు, స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు మనం అందించే అసలైన నివాళి అని పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ టి. మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ మహిపాల్ రెడ్డి జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప పోరాట యోధుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఆయన పోరాట పటిమను, ఉద్యమ స్ఫూర్తిని, ఆశయాలను అనుసరించి ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎండీ సర్దార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హనుమకొండ కలెక్టరేట్‌లో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతిని హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, డీఆర్డీవో మేన శ్రీను, ఇతర జిల్లా అధికారులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ చేసిన సేవలు, ఆయన పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఇతర అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నడికూడలో..



**వరంగల్ వాయిస్, నడికూడ :** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం నడికూడ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ జీ. విమల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విమల జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర రూపకర్తగా స్వరాష్ట్ర సాధన కోసం జయశంకర్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఉన్నత విద్యావంతుడు, పలు భాషల్లో ప్రావీణ్యం ఉన్న ఆయన తన జీవితాన్ని తెలంగాణ ఉద్యమానికి అంకితం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ విద్యావతి, ఈసీ రజనీకాంత్, ఫాతిమా, ఆఫీస్ ఖాన్, స్వప్న, దర్శన్, ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, బిక్షపతి, అరుణ్, నర్సింగం, కరుణ, శ్రావ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నాలుగో బెటాలియన్ లో..



**వరంగల్ వాయిస్, మామునూరు :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నాలుగో బెటాలియన్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బెటాలియన్ కమాండెంట్ బి. రామ్ ప్రకాష్ పాల్గొన్నారు. కమాండెంట్ రామ్ ప్రకాష్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో జయశంకర్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీ దాకా తీసుకెళ్లిన మహోన్నత వ్యక్తి ఆయనని, గొప్ప విద్యావేత్తగా తెలంగాణ రాష్ట్ర సాధననే తన జీవిత లక్ష్యంగా జీవించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్ రావు, వీరన్న, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.రాజు, విజయ్, కార్తీక్, రవి, వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# గణప సముద్రానికి పూర్వ వైభవం తీసుకురండి

## ◆ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



**వరంగల్ వాయిస్, గణపురం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి బుధవారం గణపురం మండలంలోని గణసముద్రం చెరువును బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంపై ఆందోళన వ్యక్తం చేశారు. గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ, కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ చెరువుపై ప్రతి సంవత్సరం వేలాది ఎకరాల రైతులు ఆధారపడి రెండు పంటలు పండిస్తారని అన్నారు. అయితే ఈ సంవత్సరం వర్షాలు లేకపోవడంతో చెరువులో కేవలం 14 అడుగుల 'డెడ్ స్టోరేజ్' మాత్రమే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ చెరువు ఎల్లప్పుడూ 30 అడుగులకు పైగా నీటి నిల్వను కలిగి ఉండేదని గుర్తుచేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో దేవాదుల ప్రాజెక్టు నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా గణసముద్రం చెరువుకు నీటిని తీసుకురావడానికి నిధులు మంజూరు చేసి టెండర్లు కూడా పిలిచారని ఆయన తెలిపారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం పనులను ప్రారంభించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. తక్షణమే ఇరిగేషన్ అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి గణసముద్రం చెరువును నీటితో నింపాలని రైతుల పక్షాన డిమాండ్ చేశారు. లేకపోతే వేలాది ఎకరాల పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పెద్దకోడెపాకలో తల్లిపాల వారోత్సవాలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్ అమ్మ కల్పనా దేవి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అభిరామిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. బిడ్డకు తల్లిపాలే అమృతమని, ముర్రిపాలలో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. తల్లిపాలు తాగిన పిల్లలకు డయేరియా, న్యుమోనియా వంటి వ్యాధులు సోకే ప్రమాదం తక్కువని ఆమె వివరించారు. తల్లిపాల విశిష్టతను ప్రజలకు తెలియజేయడానికే ప్రతి సంవత్సరం ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కొత్తగా తల్లులైన వారికి, బాలింతలకు, చిన్నపిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకొచ్చే వారికి కూడా తల్లిపాల గొప్పతనం గురించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సాంబలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సృజన, అరుణ, విజయకుమారి, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి పన్నులు చెల్లించండి



**వరంగల్ వాయిస్, రేగొండ :** ప్రతి ఒక్కరూ తమ ఇంటి పన్ను, నల్లా పన్ను, వ్యాపార పన్నులను సకాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని రేగొండ గ్రామ కార్యదర్శి తుల్జారాణి కోరారు. బుధవారం గ్రామంలో ఇంటింటికి తిరిగి కారోబార్, సిబ్బందితో కలిసి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రజలందరి సహకారం చాలా అవసరమని అన్నారు. పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతోనే గ్రామంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కారోబార్ ముష్క రమేష్, సిబ్బంది మొగిలి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ భవన నిర్మాణ పనుల పర్యవేక్షణ



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మురళీధర్ సహకారంతో వరంగల్ 32వ డివిజన్‌లో నిర్మిస్తున్న నూతన గ్రంథాలయ భవనం శ్లాబ్ పనులను కార్పొరేటర్ పల్లం పద్మా రవి బుధవారం దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ గ్రంథాలయం చదువుకున్న యువతీ, యువకులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ భవనాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకొచ్చేలా తీర్చిదిద్దుతానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఈ సంతోష్, డీఈ రవి కిరణ్, ఏఈ సుకృత, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, మేస్త్రీ శీను తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఏవీవీ పాఠశాల విద్యార్థిని



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏవీవీ పాఠశాలకు చెందిన విద్యార్థిని నగునూరి కీర్తన శ్రీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్ రెడ్డి తెలిపారు. గత నెల 27న హనుమకొండ జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ఆమె ఈ విజయం సాధించారు. ఏడవ తరగతి చదువుతున్న కీర్తన శ్రీ, 12 సంవత్సరాల బాలికల విభాగంలో లాంగ్ జంప్‌లో మొదటి స్థానాన్ని, 60 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానాన్ని సాధించారు. లాంగ్ జంప్‌లో చూపిన అద్భుత ప్రతిభతో ఈ నెల 7న జనగామ జిల్లాలో జరిగే 4వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆమె ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం కీర్తన శ్రీని అభినందించింది. బుధవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం ఒక గంట క్రీడల కోసం కేటాయించాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మంచి ప్రతిభ కనబరిచి పతకం సాధించాలని కీర్తన శ్రీకి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిషేధిత పొగాకు ఉత్పత్తుల పట్టివేత

## శాయంపేటలో ఒకరి అరెస్ట్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న ఒక కిరాణా దుకాణ యజమానిని శాయంపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఆగస్టు 6, 2025న ఈ సంఘటన జరిగింది. శాయంపేట ఎస్సై జె.పరమేశ్వర్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ప్రగతి సింగారం గ్రామంలోని 'జై హనుమాన్ కిరాణం' దుకాణంలో నిషేధిత పొగాకు ప్యాకెట్లు అమ్ముతున్నారని సమాచారం అందింది. దీంతో పోలీసులు వెంటనే ఆ దుకాణంపై దాడి చేశారు. తనిఖీల్లో రూ. 6,513 విలువైన నిషేధిత పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమాని దూలం జయపాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై పరమేశ్వర్ మాట్లాడుతూ, నిషేధిత గుట్కాలు, పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, నడికూడ :** తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం నడికూడ మండలం, నార్లాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శారద మాట్లాడుతూ, శిశువు పుట్టిన గంటలోపు తల్లి నుంచి వచ్చే పసుపు రంగులోని ముర్రిపాలు (కొలొస్ట్రమ్) తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ఈ ముర్రిపాలు మొదటి టీకాగా పనిచేసి, శిశువులో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని ఆమె తెలిపారు. అలాగే, మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల తల్లికి, బిడ్డకు మధ్య అనుబంధం పెరుగుతుందని చెప్పారు. అంతేకాకుండా, తల్లికి రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు శ్యామలత, భాగ్యలక్ష్మి, ఆయా మాధవి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని కాట్రపల్లి గ్రామంలో గల సీఎస్ఐ బీజేఎం ఉన్నత పాఠశాలలో బుధవారం డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమం జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ అధ్యక్షతన 'ప్రహరీ క్లబ్' ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాయంపేట హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారిని ఎదుర్కోవడానికి విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పే మంచి మాటలను పాటించాలని సూచించారు. మత్తు పదార్థాల జోలికి ఎప్పుడూ వెళ్లకూడదని, అవి జీవితాన్ని నాశనం చేస్తాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ విద్యార్థులతో డ్రగ్స్ నిర్మూలనకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసు బృందం, పాఠశాల ఉపాధ్యాయులు రాజునాయక్, రాజన్న, బిజయ్, సత్యం, ప్రవళిక, శైలజ, మౌన్య, ఉమ, శృతి, జెస్విన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# అయోధ్య మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

## తాటిపాముల వెంకట్రాములు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు కామ్రేడ్ బి.అయోధ్య అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక సంతాప ప్రకటనలో తెలియజేశారు. సూర్యాపేట నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈరోజు ఉదయం కారు ప్రమాదంలో అయోధ్య మరణించడం అత్యంత బాధాకరమని వెంకట్రాములు అన్నారు. సామ్యవాద సిద్ధాంతాలకు ఆకర్షితులై సీపీఐలో చేరిన అయోధ్య, అంచెలంచెలుగా ఎదిగి ఖమ్మం జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు నడిపారని వెంకట్రాములు గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొంటూ, అయోధ్యకు జోహార్లర్పించారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

# ఘనంగా అభయ ఆంజనేయ స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ



**వరంగల్ వాయిస్, పాలకుర్తి:** పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి నూతన ఆలయ విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతులు, వారి కుమారుడు రాజరామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా జరిగింది. పుణ్యహవచనం, అభిషేకాలు, హోమాలు, శాంతి పాఠాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతతో మార్మోగింది. అనంతరం శ్రీ సీతారాముల కల్యాణం, శ్రీ శివ పార్వతుల కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ పుణ్యక్షేత్ర అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల నాయకులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# నులిపురుగుల నివారణపై శిక్షణ



**వరంగల్ వాయిస్ వరంగల్ :** జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంపై ఎంజీఎం ఆసుపత్రిలోని పీపీ యూనిట్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మేరుగు యశస్విని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. డాక్టర్ యశస్విని మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ఈనెల 11న, మాప్-అప్ డేను 18న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన మైక్రో యాక్షన్ ప్లాన్‌ను ఇప్పటికే రూపొందించామని చెప్పారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పిల్లలలో నులిపురుగులు ఉండటం వల్ల శారీరక, మానసిక ఎదుగుదల కుంటుపడుతుందని, నీరసంగా ఉండటం, రక్తహీనత, చదువుపై శ్రద్ధ లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని డాక్టర్ యశస్విని తెలిపారు. కాబట్టి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆమె కోరారు. ఐసీడీఎస్ సూపర్వైజర్లు ఛాయాదేవి, పద్మావతి, ఎంజీఎం పీపీ యూనిట్ సూపర్వైజర్ నర్మద, ఏఎన్ఎంలు ప్రేమలత, లక్ష్మీబాయి, సులోచన, కోమల, ఇతర ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వరాష్ట్ర సాధన స్వాప్నికుడు జయశంకర్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం శాయంపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణకు ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, జయశంకర్ ను తెలంగాణ స్వరాష్ట్ర సాధన స్వాప్నికుడిగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిందం రవి, మారపల్లి వరదరాజు, మారపల్లి రాజేందర్, బాసని మార్కండేయ, శాంత, కట్టయ్య, శంకర్, రమేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప కాలేజీలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో రామప్ప జూనియర్ కాలేజీ విద్యార్థులు 'పరిచయ్' పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారని కళాశాల డైరెక్టర్ ఐలీ కర్ణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల మార్గదర్శకురాలు తేజస్వి మాట్లాడుతూ... విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకొని, అధ్యాపకులు చెప్పే విషయాలను సరిగ్గా అర్థం చేసుకోవాలని సూచించారు. అకడమిక్ స్కిల్స్‌తో పాటు కాంపిటీటివ్ స్కిల్స్‌ను కూడా మెరుగుపరచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కళాశాల డైరెక్టర్ ఐలీ కర్ణాకర్ మాట్లాడుతూ 70 మంది విద్యార్థులతో మొదలైన తమ కళాశాల ఇప్పుడు 1000 మందికి పైగా విద్యార్థులకు వివిధ కోర్సులను అందిస్తూ, వారిని ఉద్యోగులుగా తీర్చిదిద్దడం సంతోషంగా ఉందని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషి







ఉంటే విజయం తప్పక సాధిస్తారని, విద్యార్థుల లక్ష్య సాధనకు రామప్ప కాలేజీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జోనల్ మేనేజర్ పూర్ణచందర్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో తమ కళాశాల నుంచి 600 మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు, ముగ్గురు ఉద్యోగాలు సాధించిన సందర్భాలు కూడా ఉన్నాయని, ఇది వారి తల్లిదండ్రులకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా గత సంవత్సరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను, రిటైర్డ్ ఆర్మీ రామప్ప కోచ్ కమల్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలు నృత్యాలు, స్కిట్లు, ఆటపాటలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. డైరెక్టర్ ఐలీ కరుణాకర్, తేజస్వి, అకడమిక్ డీన్ వినోద్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, ఫిజికల్ డైరెక్టర్ కమల్, జోనల్ మేనేజర్ పూర్ణచందర్ తో పాటు టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముర్రి పాల విశిష్టతపై అవగాహన



**వరంగల్ వాయిస్, ములుగు :** ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ములుగు పరిధిలోని మల్లంపల్లి మండలంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ములుగు ప్రాజెక్ట్ సీడీపీఓ శిరీష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, తల్లులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పుట్టిన వెంటనే గంటలోపు శిశువుకు ముర్రిపాలు పట్టించాలని, అవి మొదటి టీకాగా పనిచేస్తాయని వివరించారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే బిడ్డకు సంపూర్ణ పోషకాహారమని, అందులో బిడ్డ ఎదుగుదలకు అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు, కాల్షియం, నీరు, రోగనిరోధక శక్తి ఉంటాయని తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి బిడ్డకు పాలు పట్టించాలి. తక్కువ బరువున్న బిడ్డలకు ప్రతి రెండు గంటలకు ఒకసారి పాలు పట్టించాలి. ఒక రొమ్ము పూర్తిగా తాగిన తర్వాతే రెండో రొమ్ము ఇవ్వాలి. మొదట వచ్చే పాలు పల్చగా, తర్వాత వచ్చే పాలు చిక్కగా, ఎక్కువ పోషకాలతో ఉంటాయి. బిడ్డ ఆకలిని గుర్తించి పాలు పట్టించాలి. తల్లిపాలు చీకలేని లేదా తక్కువ బరువున్న బిడ్డలకు పాలను ఒక గిన్నెలోకి పిండి చెంచాతో తాగించాలి. పాలు తాగిన తర్వాత బుజం మీద వేసుకొని వీపు తట్టాలి. ఎంపీఓ హనుమంతరావు, ములుగు ప్రాజెక్ట్ సూపర్వైజర్లు కమరున్నీసా బేగం, సరస్వతి, రమాదేవి, అనంతలక్ష్మి, కావ్య, కళావతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని లాదెళ్ల గ్రామ బస్టాండ్ వద్ద శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించబడిన ఈ కార్యక్రమం సాంప్రదాయబద్ధంగా, వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రెడ్ క్రాస్ చైర్మన్ డా. పెసరు విజయచందర్ రెడ్డి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి దేవతా ఉత్సవాలు గ్రామ సాంస్కృతిక వైభవానికి, సమైక్యతకు ప్రతీకలని అన్నారు. గ్రామ అభివృద్ధికి ఆధ్యాత్మికతతో పాటు సమిష్టి ప్రయత్నాలు కూడా అవసరమని సూచించారు. గుడి నిర్మాణానికి డా. విజయచందర్ రెడ్డి రూ. 1,00,116/- విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలువల రాజేశ్వరరావు, కరుగుత్త రమేష్, అంబటి రాజు, డెంగు నవీన్, గునిగంటి రమేష్, మాందాటి శ్రీకాంత్, గడ్డం రవీందర్, మాందాటి ప్రశాంత్, బత్తుల నాగేందర్, చ్.నవీన్, డెంగు రామకృష్ణ, బత్తుల సుమంత్, అంబటి శ్రీకాంత్, వెంకటేష్, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చారిత్రక ఆలయాలు అభివృద్ధి చేయాలి

## కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చారిత్రక ఆలయాలు, కాకతీయ వారసత్వ సంపదను పునరుద్ధరించాలంటూ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్యతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బుధవారం కేంద్ర పర్యాట, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ఆలయాల అభివృద్ధిపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలంటే ఆలయాల పునరుద్ధరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి ఎంపీ వివరించారు. ఆలయ పునరుద్ధరణతో స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు. ప్రధాన ఆలయాలకు కేటాయించాల్సిన నిధుల వివరాలను కూడా కేంద్ర మంత్రికి అందజేశారు. అందులో భాగంగా వరంగల్ వేయి స్తంభాల ఆలయంలోని కల్యాణ మండపం మరమ్మతులు, విగ్రహ ప్రతిష్టాపన, పార్కింగ్, శౌచాలయాల కోసం రూ.75 కోట్లు, శ్రీ భద్రకాళి ఆలయంలోని మహా మండపం పునర్నిర్మాణం, పర్యాటక సదుపాయాల కోసం రూ.100 కోట్లు, చిల్పూర్ లోని శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయం (తెలంగాణ తిరుపతి) లోని భక్తుల వసతి గదులు, కొండపైకి రవాణా మార్గం కోసం రూ.9.97 కోట్లు, భూపాలపల్లి జిల్లాలోని నపాక ఆలయం, కోటగుళ్లు, రెడ్డి గుడి ప్రత్యేక శిలలపై నిర్మితమైన ఆలయాల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని కోరారు. అలాగే వరంగల్ కోటలో ఉన్న 14 ఆలయాలకు పునరుద్ధరణ పనులకు విధులు కేటాయించాలని ఎంపీ కేంద్ర మంత్రిని కోరారు. మొత్తం రూ.185 కోట్లతో ఆలయాల పునరుద్ధరణ పనులు చేపడితే వరంగల్ నగరం ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ద బడుతుందని తెలిపారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తుల పట్ల సానుకూలంగా స్పందించిన కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ వరంగల్ ప్రాచీన ఆలయాలను ప్రసాద్ పథకంలో చేర్చనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ మేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రకి కృతజ్ఞతలు తెలియజేశారు.



## వరుస ఫ్లాప్స్‌తో..

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా రాణించిన అందాల భామ రకుల్ ప్రీత్ సింగ్. ఈ అమ్మడి గురించి తెలుగు ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.. తన అందంతో, నటనతో తెలుగు ప్రజలను కట్టిపడేసింది ఈ చిన్నది. 18 ఏళ్ల వయసులో కాలేజీలో చదువుతున్నప్పుడే మోడలింగ్‌లో కెరీర్ ప్రారంభించి 2009లో కన్నడ చిత్రం 'గిల్లి'తో తన హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించింది. ఆ తరువాత 2011 కెరటంలో సిద్ధార్థ్ రాజ్‌కుమార్ సరసన నటించింది, ఇది తెలుగు మరియు తమిళ భాషలలో విడుదలైంది. ఆ తరువాత తెలుగులో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో భారీ పాపులారిటీ అందుకున్న రకుల్ ప్రీత్ సింగ్, ఆ తర్వాత చాలామంది స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది. ఇదిలా ఉండగా ఇటీవలే తాను ప్రేమించిన ప్రముఖ బాలీవుడ్ నటుడు నిర్మాత అయిన జాకీ భగ్నానీ నీ ప్రేమించి మరీ వివాహం చేసుకుంది. ఒకవైపు సినిమాలలో నటిస్తూనే, మరోవైపు గ్లామర్ వలకబోస్తూ అందాల ఆరబోతతో యువతకు చెమటలు పట్టించే ప్రయత్నం చేస్తోంది. కానీ తెలుగులో సినిమాలు తగ్గించింది ఈ వయ్యారి భామ. తెలుగులో రకుల్ నటించిన లాస్ట్ ఎనిమిది సినిమాలు వరుసగా ఫ్లాప్ అయ్యాయి. అలాగే హిందీలోనూ సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది. ఇప్పుడు ఈ బ్యూటీ సినిమాల పరంగా సైలెంట్ అయ్యింది. సినిమాల్లో బిజీగా లేకపోయినా సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటూ అభిమానులను పలకరిస్తుంది రకుల్. ఈ క్రమంలోనే తాజాగా కొన్ని ఫోటోలను వదిలింది ఈ వయ్యారి భామ.

## చీరకట్టులో కవ్విస్తున్న నిత్యశ్రీ

కంచరపాలెం సినిమాలో చూపించిన సంఘటనల్లో ఒక్కటైనా మన జీవితంలోనూ ఎదురై ఉంటుంది. ఇక కంచరపాలెం సినిమాలోని ప్రతి క్యారెక్టర్ ప్రేక్షకులకు బాగా దగ్గరయింది. కంచెరపాలెం సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది నిత్యా. ఈ సినిమా తర్వాత పలు సినిమాల్లో నటించింది. ఇక ఇప్పుడు సోషల్ మీడియాలో సందడి చేస్తోంది నిత్యా. మొన్నమధ్య ధనుష్ నటించిన సార్ సినిమాలో కనిపించింది. ఈ చిన్నారి ఇప్పుడు ఎలా ఉందో తెలుసా..? ఈ అమ్మడు చాలా అందంగా మారింది. హీరోయిన్స్ కు ఏమాత్రం తీసిపోని అందంతో ఆకట్టుకుంటుంది నిత్యా. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు. రీల్స్ చేస్తూ ఆకట్టుకుంటుంది. పలు షార్ట్ ఫిలిమ్స్ లోనూ నటిస్తుంది ఈ చిన్నారి. అలాగే క్రేజీ ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఇటీవలే ఓ సినిమాలో హీరోయిన్ గా ఎంపికైందని తెలుస్తుంది. తాజాగా ఈ చిన్నదాని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.



## అంచనాలు పెంచుతున్న మంచు మనోజ్ సినిమా టైటిల్

టాలీవుడ్ రాకింగ్ స్టార్ మంచు మనోజ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నేటికి ఆయనకి 21 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మంచి విజయాలతో పాటు ఎన్నో ఒడిదుడుకులను కూడా ఎదుర్కొన్నారు. చాలా కాలంగా సినిమాలకి దూరంగా ఉన్న మనోజ్ ఇటీవల భైరవం అనే చిత్రంతో పలకరించాడు. మల్టీ స్టారర్ చిత్రంగా ఈ మూవీ అలరించింది. ఇక ఇప్పుడు మళ్లీ ఒక పవర్‌ఫుల్ సినిమాతో రెడీ అయ్యారు. తాజాగా "డేవిడ్ రెడ్డి" అనే టైటిల్‌తో మనోజ్ 21వ సినిమాను అధికారికంగా ప్రకటించారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొంటూ, కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధైర్యవంతుడి కథగా ఇది తెరకెక్కుతోంది. మనోజ్ ఈ సినిమాలో ఇప్పటివరకు కనిపించని లుక్‌లో, ఒక విప్లవవాది పాత్రలో కనిపించనున్నారు. "మద్రాస్ ప్రెసిడెన్సీలో జన్మించాడు. ఢిల్లీలో పెరిగాడు. ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కదిలించాడు అనే స్టేట్మెంట్‌తో రివీల్ చేసిన టైటిల్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.





## ఎన్టీఆర్ సినిమాకు భారీగా ధరలు

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 చిత్రం. ఈ సినిమా హిందీలో సాధారణ ధరలతో విడుదల కాబోతుండగా, డబ్బింగ్ వెర్షన్ తెలుగులో మాత్రం టికెట్ ధరలను నిర్మాతలు పెంచబోతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రతి స్టార్ సినిమాకు పెరుగుతున్న టికెట్ ధరలతో పాటు, డబ్బింగ్ సినిమాలకు కూడా టికెట్ రేట్లు పెంచడం ప్రస్తుతం నెటిజన్ల ఆగ్రహానికి కారణమవుతోంది. ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 సినిమాతో పాటు రజనీకాంత్ నటిస్తున్న కూలీ చిత్రాలు సొంత భాషల్లో సాధారణ టికెట్ ధరల్లోనే ప్రేక్షకులకు అందుబాటులోకి రాబోతుండగా.., తెలుగులో ఈ సినిమాలకు టికెట్ ధరలను పెంచబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో సోషల్ మీడియాలో ఈ అంశంపై తీవ్రమైన ట్రోలింగ్ జరుగుతోంది. ''ఒకే సినిమా, ఒకే కంటెంట్, కానీ వేర్వేరు భాషలకు వేర్వేరు ధరలు ఎందుకు?'' అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ''ఇది తెలుగు ప్రేక్షకులను దోచుకోవడమే'' అని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో తెలుగు సినీ పరిశ్రమ స్పందించాల్సిన అవసరం ఉందని, లేకపోతే ప్రేక్షకులు సినిమా చూడటం మానేసి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లపై ఆధారపడటం పెరుగుతుందని నెటిజన్లు ఆరోపిస్తున్నారు. ఇది భవిష్యత్తులో తెలుగు సినిమా పరిశ్రమకు చాలా నష్టం కలిగించే అవకాశం ఉందని తెలుపుతున్నారు. గతంలో ఒక సినిమా టికెట్ ధర గరిష్టంగా రూ.150 నుండి రూ.200 వరకు ఉండేది.

# తెలంగాణకు స్ఫూర్తి జయశంకర్ సార్





- పూల మాలలు వేసి నివాళులర్పించిన అధికారులు, నేతలు
- రాష్ట్ర పండువగా నిర్వహణ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయన జయంతి వేడుకలను రాష్ట్ర పండువల నిర్వహించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన చిత్రపట్టానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తి జయశంకర్ సార్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన అందించిన సేవలను గుర్తు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమకొండ బాలసముద్రం ఏకశిలా పార్కులోని ఆయన విగ్రహానికి రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ తహశీల్దార్ రవీందర్ రెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ కుటుంబ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

### వరంగల్ కలెక్టరేట్ లో..

ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పాల్గొని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్ఓ విజయలక్ష్మి, డీటీడబ్ల్యూ సౌజన్య, కలెక్టరేట్ ఏవో విశ్వ ప్రసాద్, కలెక్టరేట్ కార్యాలయ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### బల్దియా కార్యాలయంలో..

తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య కొత్త పెల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకొని బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఇంచార్జి ఎస్ఈ, సిటీ ప్లానర్ లు మహేందర్, రవీందర్ రాడేకర్, హెచ్ఓలు రమేష్, లక్ష్మారెడ్డి, ఏఓ శివ లింగం, జేఏఓ సరిత, సూపరిండెంట్ బాకం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### ములుగు కలెక్టరేట్ లో..

తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్. కొనియాడారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ దేవ్ రాజ్, డీపీఆర్ఓ రఫిక్, కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్, సూపరింటెండెంట్ మంజుల, శివకుమార్, మాధవి, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో..

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్, విద్యుత్ భవన్ లో బుధవారం ఆచార్య కొత్తపల్లి జయశంకర్








చిత్రపటానికి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఫైనాన్స్) వి.తిరుపతి రెడ్డి, డైరెక్టర్ (ఆపరేషన్) టి.మధుసూదన్, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) వి.మోహన్ రావు, డైరెక్టర్ (హెచ్ఆర్ డీ అండ్ ఐఆర్) సి.ప్రభాకర్, సీఈలు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, కె.తిరుమల్ రావు, కె.వెంకటరమణ, కె.మాధవరావు, కె.రాజు చౌహాన్, సీజీఎంలు అర్.చరణ్ దాస్, జి.రవీంద్రనాథ్, సీఎస్ కె.వెంకటేశం, ఇంజనీర్లు, అకౌంట్స్, పి&జీ ఉద్యోగులు, ఆర్టిజన్స్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానికులకే ఉద్యోగావకాశాలు

- సింగరేణి విస్తరణకు చర్యలు చేపట్టాలి
- లోక్ సభలో డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బుధవారం లోక్‌సభలో సింగరేణి కంపెనీపై కీలక ప్రశ్నలు అడిగారు. వరంగల్ ప్రాంతానికి సింగరేణి ఇచ్చిన ఉద్యోగాలు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నియామకాలు ఎన్ని, భవిష్యత్తులో సింగరేణి విస్తరణ గురించి వివరాలు తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె కోరారు. సింగరేణి కారణంగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలతో పాటు ఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరగాలన్నారు. సింగరేణి ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత పాటించాలని కోరారు. అలాగే, వరంగల్‌లో సింగరేణి విస్తరణ జరిగితే యువతకు మరిన్ని ఉద్యోగాలు వస్తాయని, జిల్లా అభివృద్ధి వేగవంతమవుతుందని ఎంపీ అభిప్రాయపడ్డారు. సింగరేణి కంపెనీ విస్తరణకు వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డాక్టర్ కడియం కావ్య కోరారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. 2020 నుంచి 2025 వరకు సింగరేణిలో 1,136 ఉద్యోగాలను స్థానికులకు ఇచ్చినట్లు వివరించారు.



# ఇంటింటికీ బీజేపీ

- ఇల్లందలో మహా సంపర్క్ అభియాన్
- గడపగడపకు చేరుతున్న సందేశం

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** బీజేపీ మహా సంపర్క్ అభియాన్ లో భాగంగా బుధవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం ఇల్లంద గ్రామ కేంద్రంలో ఇంటింటికి బీజేపీ-ప్రతి ఇంటికి బూత్ అధ్యక్షుడు కార్యక్రమాన్ని వర్ధన్నపేట మండల కన్వీనర్ రాయపురపు కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పాల్గొని గ్రామంలోని బూత్ నెంబర్ 223, 224 లో గడప గడపకూ బీజేపీ సందేశాన్ని చేరవేశారు. 11 ఏళ్ల మోదీ పాలనలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల పట్ల చేస్తున్న మోసాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. తెలంగాణ ప్రజలను వంచిస్తున్న కాంగ్రెస్ పార్టీకి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పి బీజేపీకి అండగా నిలవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రబారి గోకే వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి సత్యం, కనుకుంట రంజిత్ కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు నాంపల్లి యాకన్న, బూత్ అధ్యక్షులు సంతోష్, ఎల్ల స్వామి, బీజేవైఎం మండల నాయకులు పవన్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జయశంకర్ బాటలో కేసీఆర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జయశంకర్ సార్ చూపిన బాటలోనే తెలంగాణ ఉద్యమనేత కేసీఆర్ పయణిస్తున్నారని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం జయశంకర్ సార్ కు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ పల్లెలు, పట్టణాలు అనే తేడాలేకుండా కేసీఆర్ తిరుగి తెలంగాణ ఉద్యమ వ్యాప్తి చేశారన్నారు. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర కలను సాకారం చేశారన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే ఏజెండాగా పోరాడి సాధించిన తెలంగాణలో తాగు, సాగునీరు అందించడంతోపాటు సుమారు రెండు లక్షల ఉద్యోగాలు అందించారన్నారు. ప్రపంచమే అబ్బురపోయే విధంగా కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారన్నారు. తెలంగాణ ప్రజల తాగు, సాగు నీటి అవసరాలను తీర్చిన ఘనత బీఆర్ఎస్ కే దక్కుతుందని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. . కాళేశ్వరం సహా పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నాటి కేంద్ర ప్రభుత్వం కొనియాడిన విషయాన్ని మర్చిపోవద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత 420 హామీలు, ఆరు గ్యారంటీలు ఇచ్చి, వాటి అమలు చేతకాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. కుట్రపూరితంగానే కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు.మరో మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కోసమే జీవించే నేత కేసీఆర్ అన్నారు. ఇక్కడి ప్రజల మేలుకోరి కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారన్నారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్లు చెన్నం మధు, సంకు నర్సింగ రావు, నాయకులు జనార్ధన్ గౌడ్, పులి రజినీకాంత్, హరి రమాదేవి, నాయీముద్దీన్, జానకి రాములు, వినీల్ రావు, దేవమ్మ, తస్లీమా, ఇస్మాయిల్, ఖలీల్, రమేష్, మహమూద్, విజయ్ రెడ్డి, రామ్ చందర్, శేఖర్, రాజేందర్, శరత్, రాకేష్ యాదవ్, రాజ్ కుమార్, మనోజ్, శ్రీకాంత్, రాజు, శ్యామ్ రెడ్డి, ప్రభాకర్, అనిల్, సలాం అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com